రాజన్న ఆలయ

అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులతో సమీక్షా సమావేశం

వేములవాడ, జూన్23: వేములవాడ పట్టణంతోపాటు రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న ఆలయం, వేములవాడలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆలయ ఈవో రామకృష్ణ, అధికారులతో కలిసి రాజన్న ఆలయ సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకుని మాట్లాడారు. గతంలో సమీక్షించిన పనులను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు బ్రేక్ దర్శనం ఏర్పాట్లను మొదలుపెట్టాలని, ఇందుకోసం పనులు పూర్తి చేయాలని సూచించారు. రాజన్న కోడెల సంరక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. వందలాది కోడెల సంరక్షణ కోసం ఆధునిక పద్ధతుల్లో షెడ్లు నిర్మించాలని ఆదేశించారు. అలాగే గోశాల మొత్తం ఫ్లోరింగ్ సీసీ చేయించాలని, కోడెలు, గోవులకు దాన, పచ్చిగడ్డి పెట్టాలని విప్ సూచించారు.



రాజన్న ఆలయ గుడి చెరువు వద్ద నమూనాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గుడి చెరువును ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి

వేములవాడ గుడి చెరువును ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఆలయ చెరువు ఆవరణలోని బండ్‌పార్క్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పార్క్, ఇతర నిర్మాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నటరాజ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తయ్యాయని అధికారులు వారికి చెప్పారు. అలాగే రాజరాజేశ్వర స్వామివారికి భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో నూతన వసతిగృహాల నిర్మించాలన్నారు. గుడి చెరువులో వంద గదుల నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ సమీపంలో గదుల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించించారు. తర్వాత అందు కోసం స్థలాన్ని పరిశీలించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని సూచించారు. పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో రూ.70లక్షలతో 60స్టాల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. కూరగాయల వ్యాపారులకు అనువుగా ఉండేలా ఈ పనులు చేపట్టామని వివరించారు. అలాగే వేములవాడ పట్టణ ప్రజలతోపాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా వేములవాడ మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు మొదటి దశ రహదారి విస్తరణ పనులను చేపట్టాలని సూచించారు. రహదారి విస్తరణతోపాటు మూలవాగుపై వంతెన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ గుడి చెరువు, మూలవాగులో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చెక్కపల్లి రహదారిలోని కట్టు కాలువ, రెండో బైపాస్ రోడ్డులోని పార్క్ వద్ద మూలవాగులో కలుస్తున్న మురుగు నీటిని పరిశీలించారు. పిల్ల కాలువల ద్వారా గుడి చెరువులో మురుగు నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మించి నీటిని శుద్ధి చేసి వదలాలని ఆదేశించారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, రాజన్న ఆలయ ఈఈ రాజేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, తహసీల్దార్ మహేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి

పట్టణంలోని భగవంతరావునగర్‌లో ₹3కోట్లతో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు కౌన్సిలర్ మహేశ్ వినతిపత్రం అందజేశారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న మార్కెట్ భవనం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. వార్డులోని పలు సమస్యలు కూడా పరిష్కరించాలని ఆయన కోరారు.

జిల్లెల్ల పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాజప్రపుల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

- రోజంతా సంబురంగా గడిపిన పూర్వ విద్యార్థులు
- గురువులకు ఆత్మీయ సత్కారం

తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జూన్ 23: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రాజప్రపుల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా (1983-84లో ఎస్సెస్సీ బ్యాచ్) దాదాపు 40ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1994-1995లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందిస్తామని, రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు చేపడుతామని వారు పేర్కొన్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఇక్కడ అగ్రనైజర్లు బండి లక్ష్మణ్‌గౌడ్, జలగంప్రవీణ్, పెద్దూరి తిరుపతి, ఇటుకల అశోక్, ముక్క వాసు, రజిత, శారద, నాగరాణి, విష్ణు ఉన్నారు. అలాగే జిల్లెల్లలోని జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరిగింది. 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడిపాడారు. గత స్మృతులు నెమరవేసుకున్నారు.

వేములవాడ: శ్యామ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

వేములవాడ, జూన్ 23: స్వాతంత్ర సమరయోధుడు, భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం వేములవాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న వయసులోనే దేశభక్తి అలవర్చుకున్న ముఖర్జీ యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఇక్కడ బీజేపీ పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, నాయకులు, తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్, జూన్ 23: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 1951లో భారతీయ జన సంఘ్‌ను స్థాపించిన ముఖర్జీ.. దేశంలో ఒకే రాజ్యాంగం.. ఒకే జెండా ఉండాలని కోరుకున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్ తెలిపారు. ఇక్కడ జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చిగురు వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ గిరిధర్‌రెడ్డి, చిట్టినేని శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు ఎదునూరి గోపి, తదితరులు ఉన్నారు.

నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

- సంక్షోభ నివారణ చర్యలు చేపట్టాలి
- అఖిల భారత పద్మశాలీ సంఘ జాతీయ అధ్యక్షుడు స్వామి
- నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నాగరాజు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 23: సంక్షోభంలో ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, నేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందికట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘ అధ్యక్షుడు కామర్థపు మురళీ ప్రభుత్వాన్ని కోరారు. సరైన ఉపాధి లేక సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌లో నేత కార్మికుడు కుడిక్యాల నాగరాజు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం పనులు వారు పరామర్శించారు. నాగరాజు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ₹20వేల ఆర్థిక సాయం అందించి మాట్లాడారు. నేత కార్మికుల ఆత్మహత్యలు నివారించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆరు నెలలుగా సంక్షోభం నెలకొన్నదని, నేత కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. చేనేత, మరమగ్గాల కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని, నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. ఇక్కడ గడ్డం జగన్నాథం, పద్మశాలీ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, కందికట్ల భిక్షపతి, మా చర్ల రామచంద్రరావు, వాసాల రమేశ్, మార్త ప్రకాశ్, నర్సయ్య, సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మండల సత్యం, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, మోర రవి, డాక్టర్ గాజుల బాలయ్య, గోనె ఎల్లప్ప, కౌన్సిలర్ ఒగ్గు ఉమ, మాజీ ఎంపీటీసీ ఒగ్గు రాజేశం ఉన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ధ్రువపత్రాల పరిశీలన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

వేములవాడ రూరల్, జూన్ 23: వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, పాలిటెక్నిక్ మొదటి దశ ప్రవేశాల ప్రక్రియ చాలా కీలకమన్నారు. అభ్యర్థులు తమ ఇష్టానుసారం వీలైనన్నీ ఎక్కువ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. పాలిసెట్ వెబ్ సైట్‌ను సందర్శిస్తే గతేడాది కటాఫ్ వివరాలు లభిస్తాయని. కేటగిరీ, కోర్సు ఆధారంగా విద్యార్థులు అంచనా వేసుకోని వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. ముందుగా ఏ కోర్సు అంటే ఇష్టం, స్థానికంగా చదువుతారా.. దూర ప్రాంతమైనా పర్వాలేదా అనే విషయంపై ఒక స్పష్టతకు రావాలన్నారు. కళాశాలలో టెక్స్‌టైల్ టెక్నాలజీ శాఖాధిపతి వేబ్ అప్షన్లు నమోదు చేశామన్నారు. తొలి రోజు 228 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయినట్లు చెప్పారు. ఈ నెల 25 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు కృష్ణమనోహర్, శరణ్య, నరేశ్, సాగర్, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడ రూరల్, జూన్ 23: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఏల్లాల తిరుపతిరెడ్డి ఆత్మహత్య చేసుకోగా, ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, మాజీ సర్పంచ్ ఏశ తిరుపతి, నాయకులు కట్కం మల్లేశం, పసుల అంజిబాబు, తీగల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

వేములవాడ, జూన్23: పట్టణానికి చెందిన లాల ప్రమీల ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట లక్ష్మణ్, గడ్డం భూమయ్య, లాల శ్రీనివాస్, మహేశ్, విజయ్ యాదవ్, గోస్కుల వేణు సాయికుమార్, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై కొరబడిన పర్యవేక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు అనిల్ కుమార్

వేములవాడ, జూన్ 23: పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు పోతు అనిల్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఆయన పట్టణంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ₹20వేల నుంచి ₹లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దుస్తులు, పుస్తకాల పేరిట అందినకాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ తుమ్మల దిలీప్, రాకేశ్, సందీప్, మహేందర్ ఉన్నారు.

ఆలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను ఆశీర్వదిస్తున్న అర్చకులు

అంజన్న సన్నిధిలో కలెక్టర్

మల్యాల, జూన్ 23: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్‌కు ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా, అర్చకులు ఆశీర్వదించారు. ఇక్కడ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మ తదితరులున్నారు.

వద్దు బాబోయ్..

ఈవో పదవి

ముస్తాబాద్, జూన్ 23: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీకి బదిలీపై వచ్చేందుకు ఈవోలు జంకుతున్నారు. వద్దు బాబోయ్.. అక్కడికి.. అంటూ తెగేసి చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో మూడేండ్లుగా పూర్తి స్థాయిలో ఈవో లేరు. దీంతో ఇన్‌చార్జిలను నియమించినా.. వారు కూడా నిలదొక్కుకునే పరిస్థితి లేదు. గ్రామంలో జరుగుతున్న నిర్మాణాలు, అభివృద్ధి పనులు, పరిశుభ్రత, పచ్చదనం పంచాయతీలో నిత్యం జరిగే పనుల్లో ఐదుగురు కార్యదర్శులకు ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఇంటి నిర్మాణాలు, అవినీతి అక్రమాలకు తోడు ఇండ్ల నిర్మాణాలు క్షేత్ర స్థాయిలో ఒక మాదిరిగా, పర్మిషన్లలో మరోలాగా ఉంటున్నాయని పలురు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారిని బాధ్యతల నుంచి తప్పించారు. ఇటీవల ఆవునూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పజెప్పగా.. విధుల్లో చేరిన మూడు రోజులకే గ్రామ పంచాయతీలోని సమస్యలను దృష్టిలో పెట్టుకొని తనకు ఈ పదవీ వద్దు.. అంటూ లిఖితపూర్వకంగా లేటర్ రాసి అధికారులకు ఇవ్వడంతో మళ్లీ ఈవో పదవి ఖాళీగా అయ్యింది. అప్పటి నుంచి ఈవో పదవికి కోసం ఎవరూ ముందుకు రావడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఈవోను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టిన కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట, దుమాల, తిమ్మాపూర్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బిల్ కలెక్టర్ బదిలీ

ముస్తాబాద్ జూన్ 23: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లు రసీదుబుక్‌ల గందరగోళ వ్యవహారంపై స్థానికులు కలెక్టర్, పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ అనంతరం బిల్ కలెక్టర్ నరేశ్‌ను బదిలీ చేస్తూ శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బిల్ కలెక్టర్ నరేశ్‌ను ఎల్లారెడ్డిపేట పంచాయతీకి అక్కడ పని చేస్తున్న నవీన్‌ను ముస్తాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం

ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, జూన్ 23: రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరగారి సురేశ్ ఆధ్వర్యంలో ఉప ప్రధాన అర్చకుడు చంద్రగిరి శరత్‌తో పాటు అర్చకుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని ఆలయ పూజారి రాచకొండ భాను తెలిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 27న ఉదయం 11గంటలకు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, రాత్రి ఏకాంతసేవతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయని అర్చకులు రాచకొండ భాను, సందీప్ తెలిపారు.

రామకృష్ణకు కేంద్రమంత్రి పరామర్శ

వేములవాడ, జూన్ 23: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అస్వస్థకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందారు. హైదరాబాద్‌లోని రామకృష్ణ కుమారుడు నివాసంలో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటుండగా ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాశీ విశ్వేశ్వరనాథ్ ఆలయ ప్రధాన పూజారి శ్రీకాంత్ మిశ్రా గురూజీ కూడా పరామర్శించి స్వామివారి తీర్థ ప్రసాదాలు మంత్రి బండి సంజయ్, రామకృష్ణకు అందజేశారు. ఇక్కడ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సుభాష్, సంగప్ప ఉన్నారు.

బండి సంజయ్‌కి పూలబొకేను అందజేస్తున్న ప్రతాప రామకృష్ణ

వానలు పడాలని కప్పతల్లి ఆట

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: వర్షాలు సంవృద్ధిగా కురవాలని దుమాలలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. ఆదివారం రోకలి బండలకు కప్పను కట్టి.. పసుపు కుంకుమ పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు ఇంటింటా తిరుగుతూ కప్పతల్లి ఆట ఆడారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో పిల్లాపాపలు సల్లంగుండాలని కప్పతల్లి ఆడి.. మొక్కులు చెల్లించుకున్నారు.

భాషా పండిట్ల కల నెరవేరింది

వేములవాడ, జూన్ 23: 30 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న భాషా పండిట్ల వ్యాయామ ఉపాధ్యాయుల కల నెరవేరందని పీఆర్‌టీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మేడారం హరికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20వేల మందికి పదోన్నతులు కల్పించి 60 వేల మందికి బదిలీలు సజావుగా నిర్వహించిన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంకు రాజన్న సిరిసిల్ల జిల్లా పీఆర్‌టీయూ తరపున ప్రత్యేకత తెలుపుతున్నామని ఆయన తెలిపారు. అలాగే 10వేల హెచ్ఎం పోస్టులను కూడా ఇదే షెడ్యూల్‌లోనే పూర్తి చేయాలని ఆయన కోరారు. 317 జీవో బాధితుల కూడా సత్వరమే న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు నీలం రమేశ్, సుభాష్ రెడ్డి, శిరోమణి, సరోజా పాల్గొన్నారు.

'పోడు' భూములపై కట్టుకథలు

- గుండారంలో గందరగోళం
- అవగాహన కల్పించని అధికారులు
- అయోమయంలో గ్రామస్తులు
- అవకాశంగా తీసుకుంటున్న మధ్యవర్తులు

గుండారం ఈజీఎస్ పనులకు అభ్యంతరం చెబుతున్న పోడు కమిటీ చైర్మన్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్23: లేని పోడు భూములను ఇప్పిస్తామని కట్టుకథలు చెబుతున్నారు. గతంలోనూ అమాయకులను నమ్మించి పైసలు వసూలు చేశారు. అధికారులు భూములు లేవని తేల్చడంతో కొందరికి తిరిగిచ్చేశారు. మిగిలినవారు కూడా తిరగబడతారమోనని భావించి ఇప్పిస్తామని మభ్యపెడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో 55 హెక్టార్ల అటవీభూమిని చూపి పోడు భూమిగా నమ్మించి ఇప్పిస్తామని కొందరు అక్రమార్కులు గ్రామస్తులకు చెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని భూమి ఇప్పిస్తామని నమ్మబలికారు. సుమారు 210 మందితో అధికారులకు అర్జీలు ఇప్పించారు. వీరిని ప్రలోభపెట్టి నగదు వసూలు చేశారు. అయితే అటవీ అధికారులు గ్రామంలో పోడు భూమిలేదని తేల్చారు. ఈ క్రమంలో నగదు వసూలు చేసిన ఓ అక్రమార్కుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయినప్పటికీ ఈ వ్యవహారం ముగిసిపోలేదు. అక్రమార్కులు తప్పకుండా పోడు భూమికి పట్టాలిప్పిస్తామని చెబుతున్నారు. సదరు భూముల్లో ప్లాంటేషన్ చేసేందుకు యత్నిస్తున్న అటవీ అధికారులను అడ్డుకుంటున్నారు. వాన కాలం ప్రారంభమవడంతో ఇటీవల అటవీ శాఖ అధికారులు మళ్లీ గుండారంలోని 55 హెక్టార్ల భూమిలో ప్లాంటేషన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ విషయం తెలుసుకున్న అక్రమార్కులు గ్రామానికి చెందిన ఉసిగొల్పి అడ్డుకున్నారు. దీంతో ఈ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది.

పోడు అంటే ఏమిటి?

గిరిజనులైతే 2005కంటే ముందు సాగులో ఉన్న అటవీ భూమికి మాత్రమే పోడు భూమిగా గుర్తించి హక్కు పత్రాలు ఇస్తారు. గిరిజనేతరులైతే మూడు తరాలు అంటే 75 ఏండ్లు సాగులో ఉన్న భూమి మాత్రమే పోడు భూమిరైతుగా హక్కు పత్రాలు ఇస్తారు. నిజంగా అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీ పెట్టుకున్న వారు సాగు భూమిలోకి వెళ్లారా? వెళ్తే పోడు భూమి అక్కడ లేదని గ్రామసభ పెట్టి ఎందుకు చెప్పలేక పోతున్నారు. పోడు భూమే లేనప్పుడు సదరు కమిటీకి చైర్మన్‌ను అధికారులు ఎలా చేశారు అనే ప్రశ్న గ్రామస్తుల్లో తలెత్తుతున్నది. పోడు భూమి కోసం అర్జీ పెట్టుకుంది గిరిజనులేనా ఇంకెవరైనా ఉన్నారా అనేదాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది.

పేకాట స్థావరంపై దాడి

రుద్రంగి, జూన్ 22: రుద్రంగి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో స్థావరంపై దాడి చేశామన్నారు. ఐదుగురు పారిపోగా, మరో ఐదుగురని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.20,330 రూపాయలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నియామకం

వేములవాడ రూరల్, జూన్ 23: వట్టెంల గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు వెంకటేశ్ సన్మానించారు.

ఇల్లంతకుంట, జూన్ 23: పెద్దలింగాపూర్ గ్రామ రెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కదార రవీందర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని నాయకులు తెలిపారు. కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.